# వ్యాపార లక్షణం

'మీనాక్షి'




"**వ్యాపారస్తుడివి;** అరువు ఇవ్వకా తప్పదు, ఇచ్చి వసూలు చేసుకోకా తప్పదు. ఇచ్చినదంతా వసూలు కాదనుకో... కొంత కొంత ప్రజలమీద ఉండక తప్పదు. ఆ ఉండిపోయింది నీవు మునిగిపోయినంత కాకూడదు!" అని వ్యాపారలక్షణం చెప్పి మేనల్లుడి అభిప్రాయం కోసం కళ్లద్దాల్లోంచి చూశాడు పట్టాభి.

గీతబోధ వింటున్న అర్జునుడిలా, ఇంకా సంశయ నివృత్తి కానివాడిలాగా అయోమయంగా చూశాడు పార్థసారథి.

పార్థసారథి తండ్రి ఆఖరు ఘడియల్లో ఉండగా బావమరిది పట్టాభిని పిలిచి, తన కొడుకు బాగోగులు కనిపెట్టి వ్యాపారంలో దిట్టగా తీర్చమని కోరాడు. తన తమ్ముడు జానకిరామయ్య ఉండగా బావమరిదికి కొడుకును అప్పగించడంలో కూడా ఒక ఆలోచన ఉంది. జీవితంలో రకరకాల వ్యాపారాలు చేసి ఢక్కాముక్కీలు తిని, ఆ వ్యాపారాలు ఇద్దరు కొడుకులకూ అప్పజెప్పి తీరికగా ఉన్న పట్టాభి, బాకీలు వసూలు చేయడంలో ఘటికుడుగా పేరుపొందాడు. అటువంటివాడి పర్యవేక్షణలో పార్థసారథి వ్యాపారంలో పైకి వస్తాడని ఆ తండ్రి ఆశ.

జానకిరామయ్య మొదటి నుండి వ్యవసాయం పనులలో అన్నగారికి సాయం చేస్తూ ఉన్నా, మతసంబంధమైన సంస్థల కార్యకలాపాలలో వీలైనంతగా పాల్గొంటూ ఉంటాడు. పార్థసారథికి మానవత్వపు విలువలపై సలహాలిస్తూ ఉంటాడు. స్వతహాగా పార్థసారథి తండ్రిని, అతని ధర్మబుద్ధినీ మెచ్చుకుంటూ ఉంటాడు. వ్యాపారంలోకి దిగకముందు జరిగిన ఒక సంఘటనతో అతని తండ్రికి కొడుకుపై నమ్మకం తగ్గి పట్టాభి సలహా లేనిదే వ్యాపారంలో నెగ్గుకు రాలేడని అవసానకాలంలో తన మనస్సులోని మాట చెప్పి కన్ను మూశాడు.

000

అంతే...! ఒక రోజు షాపులో కూర్చుని ఉండగా పార్థసారథి దగ్గరకు ఒక వయస్సు మళ్లిన వ్యక్తి వచ్చి కొంచెం తటపటాయించి నేలచూపులు చూస్తూ, "బాబూ! నేను ప్రయాణంలో ఉండగా నా పర్సు పోయింది. నాకు ఇక్కడ ఎవరూ తెలిసినవాళ్లు లేరు. ఒక యాభై రూపాయలు ఇప్పించండి. ఇంటికి వెళ్లగానే పంపుతాను మా అబ్బాయిచేత ఇదిగో నా ఎడ్రస్సు!" అని ఒక్క గుక్కలో చెప్పాడు.

అక్కడే కూర్చున్న పట్టాభి "మావాడికి కూడా మీ రెవరో తెలియదు కదా వాడిని అడగడానికి ఎలా వచ్చారు?"

"వారి ముఖంలో మానవత్వం ఉంది, బాబూ!

నాకు ఆ నమ్మకం ఉంది."

"మీలో వాడికి కూడా నిజాయితీ కనబడాలి కదా?"

ఆ వ్యక్తి జవాబు చెప్పలేదు.

పార్థసారథి ఏమి ఆలోచించుకున్నాడో, గల్లా పెట్టెలోనుండి యాభై రూపాయల నోటు తీసి ఇచ్చేశాడు. ఆ వ్యక్తి ఇచ్చిన ఎడ్రస్సు కాగితం సరిగా చూడకుండానే గల్లాపెట్టెలో పడేశాడు.

000

నాలుగు రోజులైంది. వారం రోజులైంది. మరేమీ కబురూ రాలేదు, పైకమూ రాలేదు.

"ఎవరో దారంటపోయేవాడు చెప్పే కట్టు కథలు నమ్మి డబ్బు ఇచ్చేస్తావా? గల్లాపెట్టెలోనుండి డబ్బు తీస్తే తిరిగి ఎంతో కొంత లాభం ఆర్జించి తిరిగి రావాలి. నువ్వేం వ్యాపారం చేస్తావు?" అని చివాట్లు వేశాడు పట్టాభి.

ప్రక్కనే ఉన్న జానకి రామయ్య. "పోనీలే మీకు రావలసిన బాకీల్లో అదీ ఒకటి. అయినా అనుభవం వచ్చిందిగా!" అని సర్దిచెప్పాడు.


పట్టాభి ఊరుకోలేదు. "ఎడ్రసు ఉంది కదా! పిలకనులిపి మరీ వసూలు చేద్దాం. అవసరమైతే కోర్టుకు వెళ్దాం!"

"యాభై రూపాయలకోసం కోర్టుకా...! మీరు సాక్ష్యం పలికినా, బావగారూ.. కోర్టులో న్యాయం లాయర్ల పలుకుబడి మీద ఉంటుందండి. నిజానిజాలకంటే ... పలుకుబడి గల లాయరు గురించి ఖర్చుపెట్టినా, కోర్టు డిక్రీ అమలు జరిపేసరికి దిక్కులు కనబడతాయి!" అన్నాడు జానకిరామయ్య.

"ఎలా వసూలు చేస్తానో చూద్దువుగాని... రా, నాతో!" అని పార్థసారథిని ప్రయాణం చేశాడు పట్టాభి. గోవు వెనుక దూడలా వెంట నడిచాడు పార్థసారథి ఆ ఎడ్రస్సు కాగితంతో.

000

ఆ ఎడ్రస్సుకు వెళ్లేసరికి.. అది పెద్ద డాబా ఇల్లు. ఇంటి అరుగుపై కొంతమంది పెద్దలు కూర్చుని వాళ్లమధ్య ఉన్న ఇరవై ఏళ్ల యువకుడిని



ఓదారుస్తున్నారు. ఆ యువకుడి కళ్లు విచారంతో, కన్నీళ్లతో ఉబ్బి ఉన్నాయి. కొత్త వ్యక్తులను చూసి కళ్లు తుడుచుకుని ప్రశ్నార్థకంగా చూశాడు.

"నా పేరు పార్థసారథి. మాకు అనకాపల్లి మెయిన్‌రోడ్డులో బియ్యం వ్యాపారం ఉంది."

"ఒక్క క్షణం ఆగండి!" అని ఆ యువకుడు చరచరా లోపలికి వెళ్లి ఒక కవరు తీసుకువచ్చి పార్థసారథి చేతిలో ఉంచాడు.

"గత వారం అనకాపల్లి నుండి రాత్రి బస్సులో నాన్నగారు వచ్చారు. వర్షంలో తడిసి రావడం వల్ల జ్వరంతో ఇల్లు చేరుకున్నారు. మరునాడు ఉదయం నన్ను పిలిచి, స్వయంగా ఉత్తరం రాసి, వంద రూపాయలతో కవరులో ఉంచి, నన్ను స్వయంగా వెళ్లి మీకు అందజేయమన్నారు. ఆ మధ్యాహ్నమే జ్వరం విషమించి.... రాత్రికి ..." దుఃఖం పొర్లివచ్చి ఆగాడు ఆ యువకుడు.

"ఏనాడూ ఎవరినీ చేయిజాచని మనిషి అతను ... క్షమించండి... ఈ ఒక్కపనిని, నాన్నగారు చెప్పిన వెంటనే చేయలేకపోయాను!"

పట్టాభి, పార్థసారథీ నిశ్శబ్దంగా తిరుగుముఖం పట్టారు.

000

మరునాడు జానకిరామయ్య, పట్టాభి ఉండగా కవరు తెరిచి ఉత్తరం చదివాడు పార్థసారథి.

"మానవత్వం ఉన్న వ్యక్తికి,

"నే నెవరో తెలియకపోయినా, నా కథనంలో కొన్ని అనుమాన బీజాలు మీకు గోచరించినా సమయానికి సహాయం చేసిన మీకు వయస్సులో చిన్నవారైనా నా మనఃపూర్వక నమస్కారములు!

"వ్యాపారం అంటే లాభం ఆర్జించడానికేననీ, ఎట్టి పరిస్థితుల్లోనూ గల్లాపెట్టెలోనుండి డబ్బు పెట్టుబడికి పనికివస్తేనే బయటికి తీయాలనీ, ఏదోవిధంగా లాభించని పెట్టుబడి వ్యాపారస్తుడు పెట్టడనీ ప్రతీతి. కానీ స్వయంజ్యోతివంటి మానవత్వం మీ గల్లాపెట్టెలోనుండి బయటకు వచ్చింది. మరొక యాభై రూపాయలు దీనితో పంపుతూ మీ పెట్టుబడికి ధనరూప లాభంగా భావించమంటున్నాను. నేను కలం పేరుతో రచనలు సాగిస్తూ ఉండటం వల్ల అసలు పేరు బహుకొద్దిమందికే తెలుసు. నేను రాసిన నవల 'వ్యాపార లక్షణం' ఈ నెలలో ప్రచురించబడుతూ ఉంది. దానిపై వచ్చే రాబడి మీకు చెందవలసిందిగా రాస్తూ ప్రచురణకర్తలను ఈ రోజే కోరాను. ఆ రాబడి మీవంటి వ్యక్తుల ద్వారా సద్వినియోగం అవుతుందని నా నమ్మకం. ఈ బాధ్యత మీరు స్వీకరించి నాకు ఊరట కలిగించండి!

"ఇట్లు,

"అజ్ఞాత వ్యక్తి."

"మంచి మనసుతో నీ విచ్చిన డబ్బు ... అదే... నీ పెట్టుబడి నీకు ఎంత లాభం కలిగించిందో చూడు!"

"బావగారూ! వ్యాపారంలో చెయ్యితిరిగిన మీరు ఈ పెట్టుబడిపై వచ్చే లాభం ఎంతో లెఖ్ఖ వేయగలరా?" అని జానకిరామయ్య పార్థసారథి భుజం తడుతూ పట్టాభివైపు చూశాడు.

ఆరోజే పోస్టులో 'వ్యాపార లక్షణం' పుస్తకం పార్సిలు వచ్చింది. మొదటి పేజీలో రచయిత ప్రకాశకులకు వ్రాసిన ఉత్తరం కూడా ప్రచురిస్తూ.

■

## ఎన్‌ఎఫ్‌డీసీ అధ్యక్షురాలుగా హేమమాలిని!

ఇటీవలే ఆ పదవికి అలనాటి నాట్యతార హేమమాలినిని ఎంపిక చేయబోతున్నారన్న వార్త చదివి, ఆమె అభిమానులందరికీ సంతోషం కలిగింది కానీ, కొందరికి మాత్రం నచ్చలేదు. ఆమె ఆ పదవికి అర్హురాలవునో కాదో చూసికదా ఎంపిక చేయాల్సింది?-అని ప్రశ్నిస్తున్నారు. కమెర్షియల్ చిత్రాల్లో హేమకు సక్సెస్ లభించింది కానీ, మామూలుస్థాయి నటికంటే గొప్పనటిగా జనం ఆమెనేనాడూ భావించలేదు. ఆమెకంటే ఎక్కువగా సంఘసేవ చేసి, ఆఫ్‌బీట్, ఆర్ట్‌చిత్రాల్లో నటించిన షబానాఆజ్మీలాంటి వారిని ఎంపిక చేసుకోవచ్చుగా?- అంటున్నారు. చూద్దాం, ఎవరు ఎవరి మాట వింటారో!

ఎన్.